'ఒఆర్ఆర్' సాగులోని వారికీ రైతు భరోసా : మంత్రి తుమ్మల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఔటర్ రింగ్ రోడ్ (ఒఆర్ఆర్) లోపల సాగులో ఉన్న భూములకు రైతు భరోసా డబ్బులను రైతుల ఖాతాల్లో జమ చేసినట్టు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. 75,525 మంది రైతుల ఖాతాల్లో రూ. 65.82 కోట్లను విడుదల చేసినట్టు ఒక ప్రకటనలో తెలిపారు. సాగులేని, సాగుకు అనువుకానీ వెంచర్లు చేసిన భూములను రైతు భరోసా నుంచి మినహాయించినట్టు ఆయన పేర్కొన్నారు.

ఒయులో అసిస్టెంట్ ప్రొఫెసర్ల భర్తీకి పాలకమండలి ఆమోదం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నిత్యం ఖాళీలతో సతమతమవుతున్న హైదరాబాద్ ఉస్మానియా విశ్వవిద్యాలయానికి ఊరట లభించింది. మంగళవారం ఒయు పాలక మండలి (ఇసి) సమావేశంలో పలు కీలక నిర్ణయాలను ఆమోదించారు. వాటిలో ప్రధానంగా ఓయూలో 250 అసిస్టెంట్ ప్రొఫెసర్ల భర్తీకి ఆమోదం తెలిపారు. కాంట్రాక్టు పోస్టులను ఖాళీ కింద చూపించకుండా వర్సిటీలో 1200 ఖాళీలు ఉండగా.. వాటిలో 250 పోస్టులను భర్తీ చేయాలని నిర్ణయించారు. ఇక హబ్సిగూడ ప్రధాన రహదారి వెంట నిర్మిస్తున్న సెంటినరి భవనాన్ని దసరా పండుగలోపే ప్రారంభించాలని నిర్ణయించారు. ఒయులో ఉన్న సుమారు 38 ఎస్సి, ఎస్టి బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీకి త్వరలోనే నోటిఫికేషన్ జారీ చేయనున్నారు. నూతన డిఎను వచ్చే నెల వేతనంతో కలిపి ఇవ్వడానికి నిర్ణయం తీసుకున్నారు. ఒయు విసి పలు కీలకమైన ఆమోదాలతోపాటు నిర్ణయాలు తీసుకోవడం విశేషం.

ఇశ్రాయేల్, ఇరాన్ నుంచి 25 మంది రాక

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఇశ్రాయేల్, ఇరాన్ ఉద్రిక్త పరిస్థితుల్లో చిక్కుకున్న మరో 25 మంది భారతదేశానికి చేరుకున్నారు. పశ్చిమాసియా దేశాల్లో చిక్కుకున్న తెలంగాణ పౌరులను క్షేమంగా తీసుకొచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్ లో సహాయక చర్యలను ఏర్పాటు చేసింది. ఇప్పటి వరకు 48 మందిని క్షేమంగా తీసుకొచ్చారు. బుధవారం తీసుకొచ్చిన వారిలో ఇరాన్ నుంచి ఏడుగురు, ఇశ్రాయేల్ నుంచి 18 మంది ఉన్నారు. వారికి కావాల్సిన భోజనం, వసతితో పాటు హైదరాబాద్ వరకు విమానాన్ని ఏర్పాటు చేసింది. ప్రతి ఒక్కరిని క్షేమంగా తీసుకొచ్చేంత వరకు ప్రయత్నాలు కొనసాగుతాయని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

విద్యుద్ఘాతంతో తండ్రీకొడుకు మృతి

- తల్లి పరిస్థితి విషమం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు మండలం ఎల్లాపురం గ్రామంలో విద్యుద్ఘాతంతో తండ్రి, కొడుకు మృతి చెందగా, తల్లి పరిస్థితి విషమంగా మారిన ఘటన బుధవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్లాపురంకు చెందిన ఏనుగు ఎర్రమ్మ తెల్లవారుజామున బట్టలు ఆరేసుకునే దండెం ముట్టుకుంది. దానికి విద్యుత్ సర్వీసు వైరు తగిలి విద్యుత్ సరఫరా అవుతుండడంతో ఆమె విద్యుత్ షాక్‌కు గురైంది. ఆమెను కాపాడేందుకు భర్త ఏనుగు నరసయ్య (55) పట్టుకోగా అతనికీ విద్యుత్ షాక్ తగిలింది. వారి కేకలు విన్న చిన్న కుమారుడు ప్రవీణ్ (30) వారిని కాపాడే ప్రయత్నం చేయడంలో అతనూ విద్యుద్ఘాతానికి గురయ్యాడు. ఈ ఘటనలో నర్సయ్య, ప్రవీణ్ అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన ఎర్రమ్మను ఖమ్మంలోని ఓ ఆస్పత్రికి తరలించారు. ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్టు తెలిసింది.

విద్యా వ్యవస్థను మరింత పటిష్టం చేయాలి

- ఐఎఎస్ లు వారానికి రెండు పాఠశాలలు సందర్శించాలి..
- పాఠశాలల్లో నూతన గదులు సోలార్ కిచెన్లు నిర్మించాలి
- పదో తరగతి ఉత్తీర్ణులైన ప్రతి ఒక్కరూ ఇంటర్మీడియట్‌లో చేరేలా చూడాలి
- విద్యా శాఖ సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

ప్రజాశక్తి హైదరాబాద్ బ్యూరో

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న సిఎం రేవంత్ రెడ్డి

తెలంగాణలో విద్యా వ్యవస్థను మరింత పటిష్టం చేయాలని ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. అదనపు కలెక్టర్లు వారంలో కనీసం రెండు ప్రభుత్వ పాఠశాలలను సందర్శించాలని ఆయన సూచించారు. విద్యా శాఖపై ఐసిసిసిలో సిఎం రేవంత్ బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ ఏడాది ప్రయివేటు పాఠశాలల నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో 48 వేల మంది చేరారని అధికారులు సిఎంకు వివరించారు. పెరిగిన విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా నూతన గదులు నిర్మించాలని సిఎం ఆదేశించారు. ప్రత్యేక అవసరాలున్న పిల్లలకు అవసరమైన వసతులను పాఠశాలల్లో కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. మధ్యాహ్న భోజనం తయారీకి సంబంధించి గ్యాస్, కట్టెల పొయ్యిల బాధల నుంచి మధ్యాహ్న భోజనం తయారు చేసే మహిళలకు విముక్తి కల్పించాలని... సోలార్ కిచెన్ల ఏర్పాటుపై తక్షణమే దష్టి సారించాలని తెలిపారు. పదో తరగతిలో ఉత్తీర్ణులవుతున్న విద్యార్థుల సంఖ్యకు, ఇంటర్మీడియట్‌లో నమోదు అవుతున్న విద్యార్థుల సంఖ్యకు మధ్య వ్యత్యాసం ఎక్కువ ఉండడంపై అధికారులను సిఎం ప్రశ్నించారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులంతా కచ్చితంగా ఇంటర్మీడియట్‌లో చేరేలా చూడాలని సూచించారు. ఇంటర్మీడియట్ అనంతరం జీవనోపాధికి అవసరమైన స్కిల్డ్ కోర్సుల్లో శిక్షణ పొందవచ్చని.. తద్వారా వారి జీవితానికి ఢోకా ఉండదని అన్నారు. సమావేశంలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి బి అజిత్ రెడ్డి, విద్యా శాఖ కార్యదర్శి యోగితా రాణా, సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ ఎ శ్రీదేవసేన, విద్యా శాఖ ప్రత్యేక కార్యదర్శి ఎం హరిత తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ రైజింగ్-2047పై ఇంగ్లాండ్ మాజీ ప్రదాని టోనీ బ్లెయిర్ ప్రశంసలు

ముఖ్యమంత్రికి లేఖ ద్వారా అభినందనలు

తెలంగాణ రైజింగ్-2047పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఇంగ్లాండ్ మాజీ ప్రదాని టోనీ బ్లెయిర్ ప్రశంసించారు. ఈమేరకు టోనీ బ్లెయిర్ సిఎంకు రాసిన లేఖలో అభినందనలు తెలిపారు. ఢిల్లీ లో టోనీ బ్లెయిర్ ను కలిసిన సందర్భంలో తెలంగాణ రైజింగ్ విజన్-2047 గురించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆయనకు వివరించారు.

తెలంగాణ రైజింగ్ విజన్-2047లో నిర్దేశించుకున్న మూడు ట్రిలియన్ డాలర్ల ఎకానమీ, పెట్టబడుల సాధన, రైతులు, మహిళా, యువ సాధికారిత, మౌలిక వసతుల కల్పన, ఐటీ, ఇతర రంగాల అభివృద్ధి లక్ష్యాలను, చేరుకునే మార్గాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరించారు. తెలంగాణ రైజింగ్ విజన్ రూపకల్పన... అమలుకు సంబంధించి లెటర్ ఆఫ్ ఇంటెంట్‌ను **టోనీ బ్లెయిర్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ గ్లోబల్ ఛేంజ్ (టిబిఐజిసి), తెలంగాణ ప్రభుత్వ ప్రతినిధులు మార్చుకున్నారు.**

తెలంగాణ రైజింగ్ విజన్-2047లోని స్పష్టత... నిర్దేశించుకున్న లక్ష్యాలు ఎంతో ఆకట్టుకున్నయని టోనీబ్లెయిర్ ప్రశంసించారు.

తెలంగాణ రైజింగ్ విజన్-2047లో నిర్దేశించుకున్న లక్ష్యాల సాధనకు ఇండియాలోని టిబిఐజిసి ప్రతినిధి తెలంగాణ ప్రభత్వానికి సహకరిస్తారని ఆయన తెలియజేశారు. ఈ క్రమంలో సిఎంఒకు ఏవైనా సందేహాలు ఉంటే ఎటువంటి సంకోచాలు లేకుండా తమ భారత ప్రతినిధిని సంప్రదించాలని సిఎం రేవంత్ రెడ్డికి టోనీబ్లెయిర్ సూచించారు.

తెలంగాణకు అదనంగా నిధులు తెచ్చిన మొఖాలా

- కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండిపై కడియం ఘాటు వ్యాఖ్యలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నరేంద్ర మోడీ ప్రధానమంత్రిగా పదకొండు ఏండ్లు కావస్తున్నా తెలంగాణకు అదనంగా సహకరించలేదని, పక్కన ఆంధ్రాకు వేలకోట్ల సాయం చేస్తున్నారని, తెలంగాణకు చెందిన కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ ఇద్దరూ ఉన్నప్పటికీ ఒక్క వెయ్యికోట్లు తెలంగాణకు అదనంగా తెచ్చిన మొఖాలు కాదని కాంగ్రెస్ నేత, మాజీ ఉప ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఘాటుగా విమర్శించారు. బుధవారం జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ కేంద్రంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన బిజెపిపై విరుచుకుపడ్డారు. బిజెపి తెలంగాణ పట్ల వివక్ష చూపుతున్నదని అన్నారు. ఇలాంటి బిజెపికి తెలంగాణలో ఓట్లు అడిగే నైతిక హక్కు లేదని తెలిపారు. బిఆర్ఎస్ పదేళ్ల అధికారంలో ఉండి అధికారాన్ని అడ్డుపెట్టుకొని విపరీతమైన అవినీతి అక్రమాలకు పాల్పడి వేల ఎకరాల భూములు, వేల కోట్ల రూపాయలు సంపాదించుకున్నట్టు చెప్పారు. బ్రహ్మాండమైన ప్యాలెస్‌లు ఫామ్‌హౌస్‌లు కట్టుకొని ఇవ్వాళ నీతివంతులుగా మాట్లాడడాన్ని ప్రజలు గమనించాలని కోరారు. రాష్ట్రంలో పేద, బలహీన వర్గాల పక్షాన నిలిచేది కాంగ్రెస్ పార్టీయేనని అన్నారు. కాంగ్రెస్ పార్టీని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని స్పష్టం చేశారు. ఇతర అభివృద్ధి పనులతో పాటు మార్చి 16న సిఎం చేతుల మీదుగా జరిగిన నియోజకవర్గ అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నట్టు చెప్పారు. అందరి సహకారంతో నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసుకుందామని అన్నారు.

ఈసెట్‌లో 8,621 మందికి సీట్ల కేటాయింపు

ఇంజినీరింగ్‌లో 8,567 మంది, ఫార్మసీలో 54 మంది

- సెల్ఫ్ రిపోర్టింగ్ గడువు 29

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో బిటెక్, బిఇ, బి ఫార్మసీ, బిఎస్‌సి మ్యాథమెటిక్స్ కోర్సుల్లో ద్వితీయ సంవత్సరంలో లాటరల్ ఎంట్రీ ద్వారా 2025-26 విద్యాసంవత్సరానికి సంబంధించి బుధవారం సాంకేతిక విద్యాశాఖ సీట్లు కేటాయించింది. ఈ మేరకు సాంకేతిక విద్యాశాఖ కమిషనర్, ఈసెట్ ప్రవేశాల కన్వీనర్ ఎ శ్రీదేవసేన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈసెట్‌లో 17,768 మంది అర్హత సాధించారని తెలిపారు. వారిలో 11,887 మంది ధ్రువపత్రాల పరిశీలనకు హాజరయ్యారని, 11,832 మంది 4,50,938 వెబ్‌ఆప్షన్లను నమోదు చేశారని పేర్కొన్నారు. ఈసెట్‌లో ఇంజనీరింగ్‌లో 12,459 సీట్లు, ఫార్మసీలో 1,266 సీట్లు కలిపి మొత్తం 13,725 సీట్లు అందుబాటులో ఉన్నాయని వివరించారు. ఈసెట్ మొదటి విడత కౌన్సెలింగ్‌లో ఇంజనీరింగ్‌లో 8,567 మంది, ఫార్మసీలో 54 మంది కలిపి మొత్తం 8,621 మంది అభ్యర్థులకు సీట్లు కేటాయించామని తెలిపారు. సరిపోయినన్ని వెబ్‌ఆప్షన్లను నమోదు చేయకపోవడం వల్ల 3,211 మందికి సీట్లు కేటాయించలేదని పేర్కొన్నారు. ఆర్థికంగా వెనుకబడిన తరగతులు (ఈడబ్ల్యూఎస్) కోటాలో 613 మంది అభ్యర్థులకు సీట్లు కేటాయించామని వివరించారు. సీట్లు పొందిన అభ్యర్థులు హ్ట్ట్ప్స్://టగెఎచెట్.న్ఇచ్.ఇన్ వెబ్‌సైట్ ద్వారా ఈనెల 29 వరకు సెల్ఫ్‌రిపోర్టింగ్ చేయాలని కోరారు. సెల్ఫ్ రిపోర్టింగ్ చేయకుంటే సీటు రద్దవుతుందని స్పష్టం చేశారు. ఈసెట్ తుదివిడత కౌన్సెలింగ్ తర్వాత వచ్చేనెల 19 నుంచి 22 వరకు కాలేజీల్లో రిపోర్టు చేయాలని సూచించారు. అప్పుడే ఒరిజినల్ టిసి, ధ్రువపత్రాల జిరాక్స్ ప్రతులను ఇవ్వాలని కోరారు. ఆయా తేదీల్లో సీట్లు కేటాయించిన కాలేజీల్లో రిపోర్టు చేయకుంటే రద్దవుతుందని తెలిపారు.

ప్రయివేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ స్కూల్స్

- రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రయివేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలనే ఉద్దేశంతో తెలంగాణ ప్రభుత్వం పబ్లిక్ పాఠశాలలను ఏర్పాటు చేస్తోందని రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళీ అన్నారు. బుధవారం రంగారెడ్డి జిల్లా మంచాల మండలంలోని ఆరుట్ల ప్రభుత్వ పబ్లిక్ స్కూల్‌ను మురళీ పరిశీలించారు. ఆయనతోపాటు మహబూబ్‌నగర్ జిల్లాలోని వంగూరు, పోల్కంపల్లి గ్రామాల పేరెంట్స్ కమిటీ సభ్యులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం విద్యా వ్యవస్థలో మార్పులు తీసుకొచ్చేందుకు కృషి చేస్తోందన్నారు. ఇందులో భాగంగా ఆరుట్ల గ్రామంలో మొట్టమొదటి తెలంగాణ పబ్లిక్ పాఠశాల ప్రారంభించినట్టు చెప్పారు. ఇక్కడ ఇప్పటికే 2వేల మంది విద్యార్థులు అడ్మిషన్ తీసుకున్నారన్నారు. వారికి మెరుగైన వసతులు కల్పిస్తున్నామని, పనులు చాలా వేగవంతంగా జరుగుతున్నాయని, ఇప్పటికే 90 శాతం పూర్తయినట్టు చెప్పారు. ఈ పనులను పరిశీలించడానికి నాగర్‌కర్నూల్ జిల్లాలోని వంగూరు, పోల్కంపల్లి గ్రామాల ప్రభుత్వ పాఠశాలల పేరెంట్స్ కమిటీ సభ్యులు దాదాపు 150 మంది వచ్చినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి, ప్రధానోపాధ్యాయులు సిద్ధగోని గిరిధర్‌గౌడ్, నోడల్ ఆఫీసర్ సుప్రియ, కొర్ర కిషన్ చౌహాన్, మోహన్, పాఠశాల పేరెంట్స్ కమిటీ సభ్యులు ఎండి జానీ పాషా, నూకం రాజు, కంబాలపల్లి భాస్కర్, లాలాగారి జంగయ్య, శ్రీశైలం, స్వాతి, జ్యోతి, పారిజాత, సంధ్య, పార్వతి, మల్లేష్, జంగయ్య తదితరులు ఉన్నారు.

నీట్ టాపర్లకు ఆకాశ్ సత్కారం

ప్రజాశక్తి - హైదరాబాద్

నీట్, జెఇఇ అడ్వాన్స్‌లో ఉత్తమ ర్యాంకులు సాధించిన తమ విద్యార్థులను ఆకాశ్ ఎడ్యుకేషనల్ సర్వీసెస్ (ఎఇఎస్ఎల్) సత్కరించింది. బుధవారం నగరంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆ సంస్థ చీఫ్ అకడమిక్, బిజినెస్ హెడ్ మాట్లాడుతూ.. నీట్ యుజిలో తమ విద్యార్థులు టాప్ 10లో ఐదు ర్యాంక్‌లను పొందారన్నారు. ఈ అద్భుతమైన ఫలితాలు మాకు గర్వకారణంగా ఉన్నాయన్నారు. పరీక్షల సరళిలో మార్పులు వచ్చినా, ప్రశాంతంగా, ఏకాగ్రతతో ముందుకు వెళ్లేలా విద్యార్థుల్ని తాము తీర్చిదిద్దుతామన్నారు.

లాసెట్‌లో 30,311 మంది ఉత్తీర్ణత

- ఫలితాలు విడుదల చేసిన బాలకిష్టారెడ్డి, ఎం కుమార్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో లా కోర్సుల్లో 2025-26 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం ఈ నెల ఆరోతేదీన నిర్వహించిన లాసెట్ రాతపరీక్ష ఫలితాలను బుధవారం హైదరాబాద్ మాసబ్‌ట్యాంక్‌లో ఉన్నత విద్యామండలి చైర్మన్ వి బాలకిష్టారెడ్డి, ఒయు విసి కుమార్ మొలుగారం విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ ఇటిక్యాల పురుషోత్తం, కార్యదర్శి శ్రీరాం వెంకటేశ్, లాసెట్ కన్వీనర్ బి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ఈ నెల ఆరో తేదీన నిర్వహించిన లాసెట్‌కు 57,715 మంది అభ్యర్థులు దరఖాస్తు చేస్తే 45,609 మంది హాజరయ్యారు. వారిలో 30,311 (66.46 శాతం) మంది అభ్యర్థుల ఉత్తీర్ణత సాధించారు. 39,198 మంది అబ్బాయిలు దరఖాస్తు చేయగా, 30,715 మంది పరీక్ష రాశారు. వారిలో 21,002 (68.38 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. 18,513 మంది అమ్మాయిలు దరఖాస్తు చేస్తే 14,891 మంది పరీక్షకు హాజరయ్యారు. వారిలో 9,306 (62.49 శాతం) మంది అర్హత సాధించారు. ట్రాన్స్‌జెండర్లు నలుగురు దరఖాస్తు చేస్తే ముగ్గురు పరీక్ష రాయగా, అందరూ అర్హత పొందారు. ఈ సందర్భంగా బాలకిష్టారెడ్డి, కుమార్ మాట్లాడుతూ గత విద్యాసంవత్సరంలో 31 లా కాలేజీల్లో 8,680 సీట్లు అందుబాటులో ఉన్నాయని వివరించారు. అందులో కన్వీనర్ కోటాలో 7,148 సీట్లు, 1,532 సీట్లు యాజమాన్య కోటాలో ఉన్నాయని చెప్పారు. గత విద్యాసంవత్సరంలో 7,125 మంది ప్రవేశాలు పొందారని వివరించారు.

లాసెట్ ఫలితాల వివరాలు

కోర్సు	దరఖాస్తు	పరీక్షకు హాజరు	ఉత్తీర్ణత	శాతం
3 ఏళ్ల ఎల్‌ఎల్‌బి	41,210	32,118	21,715	67.61
5 ఏళ్ల ఎల్‌ఎల్‌బి	11,695	9,325	4,833	51.83
ఎల్‌ఎల్‌ఎం	4,810	4,166	3,763	90.33
మొత్తం	57,715	45,609	30,311	66.46

రాష్ట్ర ప్రజలకు సిఎం బోనాల శుభాకాంక్షలు

ప్రజాశక్తి హైదరాబాద్ బ్యూరో

బోనాల ఉత్సవాలు ప్రారంభం సందర్భంగా ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఆషాఢ మాసం బోనాల ఉత్సవాలతో రాష్ట్రంలో పండుగ వాతావరణం మొదలవుతుందన్నారు. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగను ప్రతి ఒక్కరు జరుపుకోవాలని ఆకాక్షించారు. చారిత్రాత్మక గోల్కొండలో వెలసిన జగదాంబిక ఎల్లమ్మ తల్లికి ఆషాఢ మాసం తొలి బోనం సమర్పించడంతో జంటనగరాల్లో బోనాల సందడి నెలకొంటుందన్నారు. జంట నగరాల్లో బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది ప్రత్యేక ఏర్పాట్లు చేయడంతో పాటు బోనాల ఉత్సవాల ఏర్పాట్లు, భక్తుల సదుపాయాల కోసం 20 కోట్ల నిధులు విడుదల చేశామన్నారు. సందర్శకులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని, గట్టి భద్రతా చర్యలు తీసుకోవాలని సూచించారు.

విజయోత్సవ ర్యాలీలో సిఐటియు నాయకులు, కార్మికులు

టిఐడిసిలో వరుసగా ఐదోసారి సిఐటియు విజయం

- ఈ గెలుపు కార్మికులకు అంకితం - చుక్క రాములు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాజిపల్లి పారిశ్రామిక ప్రాంతంలోని టిఐడిసి పరిశ్రమ గుర్తింపు ఎన్నికల్లో సిఐటియు వరుసగా ఐదోసారి గెలుపొందింది. పరిశ్రమలో మొత్తం 161 ఓట్లకు సిఐటియుకి 87, బిఎంఎస్‌కు 74 ఓట్లు రాగా, 13 ఓట్ల తేడాతో బిఎంఎస్ జాతీయ ఉపాధ్యక్షులు ఎస్ మల్లేశంపై సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు ఘన విజయం సాధించారు. సిఐటియు విజయం పట్ల కార్మికులు పరిశ్రమ ఎదుట విజయోత్సవ ర్యాలీ నిర్వహించి స్వీట్స్ పంచుకొన్నారు. ఈ సందర్భంగా చుక్క రాములు మాట్లాడుతూ.. టిఐడిసి పరిశ్రమలో ఐదోసారి విజయాన్ని అందించిన కార్మికులకు అభినందనలు తెలిపారు. ఈ గెలుపు కార్మికులకే అంకితమన్నారు. సిఐటియుతో కార్మికుల జీవితాలు బాగుపడతాయని నమ్మిన కార్మికులు భవిష్యత్తులో మరిన్ని సౌకర్యాలు సాధించేందుకు ఈ గెలుపు దోహదపడుతుందన్నారు. సిఐటియుతోనే కార్మికులకు రక్షణ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు బి మలేశం, జిల్లా కోశాధికారి కె రాజయ్య, యూనియన్ నాయకులు భాస్కర్ రెడ్డి, చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు, శ్రీరాములు, జగన్ రెడ్డి, ప్రభాకర్, సత్తయ్య, సుధాకర్ గౌడ్, వివిఎస్ రాజు, తలారి శ్రీనివాస్, సోమన్న, శ్రీధర్, మాణిక్యం, నరసింహ గౌడ్, బిలాల్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చట్టపరంగా బనకచర్లను అడ్డుకుంటాం

- 30న ప్రజాభవన్‌లో పిపిటి
- బ్యారేజీల పునరుద్ధరణకు కన్సల్టెంట్‌గా ఎన్‌డిఎస్ఎ
- పదోన్నతులు, బదిలీలకు గ్రీన్ సిగ్నల్ : మంత్రి ఉత్తమ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిపాదించిన గోదావరి-బనకచర్లను చట్టపరంగా అడ్డుకుంటామని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ రైతుల ప్రయోజనాలకు భంగం వాటిల్లకుండా చూడడమే తమ ముందున్న కర్తవ్యమని తేల్చిచెప్పారు. ఈ ప్రాజెక్టును నిర్మిస్తే తెలంగాణ ప్రాంత ప్రయోజనాలు ఏ విధంగా దెబ్బ తింటాయో, ఏవిధంగా వాటిల్లే అంశంలో బలమైన వాదనలు వినిపించి ప్రాజెక్టు నిర్మాణాన్ని నిలువరిస్తామన్నారు. బుధవారం మధ్యాహ్నం హైదరాబాద్ ఎర్రమంజిల్ కాలనీలోని నీటిపారుదల శాఖ కేంద్ర కార్యాలయంలో ఉన్నతాధికారులతో సుదీర్ఘంగా సమీక్షించారు. నీటిపారుదల శాఖ ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్‌పాటిల్, ఈఎన్సీ మహమ్మద్ అంజద్ హుస్సేన్, డిప్యూటీ ఇఎన్‌సి శ్రీనివాస్‌తోపాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

'సిఆర్ పాటిల్‌కు చెప్పాం'

గోదావరి-బనకచర్ల ప్రాజెక్టుతో తెలంగాణకు సంభవించనున్న ముప్పును సిఎం రేవంత్‌రెడ్డితో కలసి ఈ నెల 19న కేంద్ర జలశక్తి మంత్రి సిఆర్ పాటిల్‌కు సవివరంగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ను ఇచ్చామన్నారు. బనకచర్ల ప్రాజెక్టుకు సంబంధించిన ప్రీ-ఫిజిబిలిటీని నివేదికను ఎట్టిపరిస్థితుల్లోనూ ఆమోదించవద్దని కోరామన్నారు. ఈ ప్రాజెక్టును నిర్మిస్తే తెలంగాణ నీటి కేటాయింపులపై ప్రభావం పడుతుందని, దానిని దృష్టిలో పెట్టుకుని నివేదికను తిరస్కరించాలని విజ్ఞప్తి చేసినట్టు వివరించారు. అందుకు స్పందించిన కేంద్ర మంత్రి పాటిల్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సమర్పించిన నివేదికను ఆమోదించ లేదనీ, త్వరలోనే అపెక్స్ కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని మంత్రి వివరించారు. పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో పుట్టుకొచ్చిన గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు నిర్మిస్తే తెలంగాణ ప్రయోజనాలకు జరిగే నష్టంపై ఈ నెల 30న ప్రజాభవన్‌లో మధ్యాహ్నం మూడు గంటలకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ను ఏర్పాటు చేశామన్నారు.

నీటిపారుదలశాఖలోకి సైనికాధికారులు

టన్నెల్ నిర్మాణాలలో అపారమైన అనుభవం కలిగిన ప్రముఖ సైనికాధికారులిద్దరిని నీటిపారుదల శాఖలోకి తీసుకునేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు మంత్రి ఉత్తమ్ చెప్పారు. ఇటీవల రోహ్తంగ్, జోజిలా టన్నెల్ నిర్మాణంలో పనిచేసిన ఇద్దరు అధికారులను వినియోగించుకునేందుకు నీటిపారుదల శాఖ కసరత్తు చేస్తున్నదన్నారు. భారత సైన్యంలో ఇంజినీర్ ఇన్-చీఫ్ గా పనిచేసిన జనరల్ హార్బల్ సింగ్‌ను రాష్ట్ర నీటిపారుదల శాఖకు సలహాదారుడిగా నియమించనున్నట్టు చెప్పారు. అంతర్జాతీయ స్థాయిలో పేరు గడించిన టన్నెల్ టెక్నాలజీ నిపుణులు కర్నల్ పరిక్షిత్ మెహ్రా జులైలో రాష్ట్ర నీటిపారుదల శాఖలో చేరనున్నారని వివరించారు. అలాగే మేడిగడ్డ, అన్నారం, సిందిళ్ళ బ్యారేజిలపై ఎన్డీఎస్ఎ ఇచ్చిన నివేదికపై సమీక్షించిన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పునరుద్ధరణ పనులకై ఎన్‌డిఎస్ఎ డిజైన్ కన్సల్టెంట్‌గా వ్యవహరిస్తుందన్నారు. పునరుద్ధరణ పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు వీలుగా ప్రతివారం సమీక్షిస్తూ ఎప్పటికప్పుడు తనకు నివేదికను సమర్పించాలన్నారు. కేంద్ర జలసంఘం సూచనలకు అనుగుణంగా పనులను వేగవంతం చేయాలనీ, డిండి ప్రాజెక్ట్ భూసేకరణ విషయమై సంబంధిత జిల్లా కలెక్టర్లతో సమావేశం నిర్వహించాలన్నారు.

ఆధునికంగా ఎస్ఎల్‌బీసీ పనులు

శ్రీశైలం ఎడమ కాలువ (ఎస్ఎల్‌బిసి)పనుల పురోగతిపై సమీక్షించిన మంత్రి, పునరుద్ధరణ పనుల కోసమై అంతర్జాతీయ స్థాయి ఏజెన్సీలతో చర్చించి ప్రతిపాదనలు స్వీకరిస్తున్నామన్నారు. ఈమేరకు అధికారులకు ఆదేశాలు ఇచ్చామని, పనులను వేగవంతం చేసేందుకు ఖర్చుకు వెనకాడకుండా ముందుకు పోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. అదే సమయంలో నీటిపారుదల శాఖలో పెండింగ్‌లో ఉన్న పదోన్నతుల ప్రక్రియను పూర్తిచేయాలని, అనంతరం బదిలీల తంతును వెంటనే చేపట్టాలని ఆదేశించారు. ప్రధాన ప్రాజెక్టులలో పూడికతీత పనులపై ఆయన స్పందిస్తూ అనేక జలాశయాలు పూడికతో నిండినందున 20 నుండి 25 శాతం మేర నీటిసామర్థ్యం తగ్గిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన జాతీయ మార్గదర్శకాలకు అనుగుణంగా మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. నాగార్జునసాగర్, నిజాంసాగర్ తదితర ప్రాజెక్టుల పూడిక తీత పనులపై ఆయన అడిగి తెలుసుకున్నారు. ప్రత్యేకంగా నాగార్జునసాగర్ పూడికతీత పనులను సత్వరం ప్రారంభించాలన్నారు. ఈవిషయమై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి సమాచారం అందించాలని అధికారులను సూచించారు. దేవాదుల ప్రాజెక్టు మూడో దశ పనుల పురోగతితో పాటు సీతారామ ప్రాజెక్టుకు ప్రస్తుతం కేటాయించిన నిధుల పరిమితులకు లోబడి అదనపు ప్యాకేజీలను రూపొందించే అంశాలపై అధికారులు దృష్టి సారించాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల కొనసాగింపు ఉత్తర్వులివ్వాలి

- పెండింగ్ వేతనాలను వెంటనే ఇవ్వాలి
- సిఎస్ రామకృష్ణారావుకు టిజిఎస్‌జిసిఒఇఎఫ్ వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న రెండు లక్షల కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను కొనసాగిస్తూ ఉత్తర్వులివ్వాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (టిజిఎస్‌జిసిఒఇఎఫ్) రాష్ట్ర ప్రభుత్వానికి విన్నవించింది. మూడు నుంచి ఆరు నెలల పాటు పెండింగ్‌లో ఉన్న వేతనాలను చెల్లించాలని కోరింది. ఈ మేరకు బుధవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావుకు ఆ ఫెడరేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జె వెంకటేశ్, జె కృష్ణారెడ్డి, ఉపాధ్యక్షులు పద్మశ్రీ, కార్యదర్శి జె కుమారస్వామి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జె వెంకటేశ్ మాట్లాడు తూ.. రాష్ట్ర ప్రభుత్వ శాఖలు, సంస్థల్లో సుమారు రెండు లక్షలకు పైగా ఉద్యోగులు 20 ఏళ్లుగా కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్, డైలీవేజ్ మొదలైన పద్ధతుల్లో అతి తక్కువ వేతనాలతో పనిచేస్తున్నారని వివరించారు. పెరుగుతున్న నిత్యావసర ధరలతో జీతాలు సరిపోక, కుటుంబ అవసరాల కోసం అప్పులు చేస్తున్నారని వాపోయారు. ఆ ఉద్యోగులకు ఏటా ఏప్రిల్‌లో ప్రభుత్వం కొనసాగింపు ఉత్తర్వులను జారీ చేస్తున్న విషయాన్ని గుర్తుచేశారు. 2025లో ఇంతవరకూ ఉత్తర్వులు రాకపోవడం పోవడంతో వారు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. నెలల తరబడి వేతన బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయనే విషయాన్ని ఎత్తిచూపారు. ప్రభుత్వ పాలన సజావుగా సాగడంలో కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల పాత్ర కీలకమైన దన్నారు. ఈ నేపథ్యంలో బకాయి వేతనాలను వెంటనే చెల్లించాలని, కొనసాగింపు ఉత్తర్వులను జారీ చేసే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

మహారాజు శ్రీ నందిగామ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు లో
ఓ .ఎస్ .నెంబర్ 221/ 2021
బిట్వీన్ :
మద్దుకూరి అమరలింగారావు. ...వాది
మరియు
చలమాల సైదులు (డైడ్) అండ్ త్రి అదర్స్
...ప్రతివాదులు
పై నెంబర్ దావాలో 4వ ప్రతివాదైన చలమాల మై దీప్తి , భర్త మాధవరావు , 34సం.. డోర్ నెం. 12-163 /1/1, రాధాకృష్ణ కాలనీ, పీర్జాడి గూడ, ఘట్ కేసర మండలం ,మేడిపల్లి పోస్ట్, హైదరాబాదు అనువారికి ఎన్నిసార్లు దావా సమన్లు పంపిణీనను, ఉద్దేశపూర్వకంగా పుచ్చుకొనకుండా త్రిప్పి పంపుచున్నందున ఈ ప్రకటన ద్వారా సమన్లు పంపించవలసినదిగా శ్రీ కోర్టు వారు ఉత్తర్వులు ఇచ్చి ఉన్నారు. కావున సదరు నాలుగో ప్రతివాది **30-6-2025**వ తేదీన ఉదయం గం.**10:30** ని. లకు శ్రీ కోర్టు వారి ఎదుట స్వయంగా గాని న్యాయవాది ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలియపరచుకొనవలెను. లేనియెడల మీ పరోక్షమందు విచారించి తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.
//శ్రీ కోర్టు వారి అనుమతితో //
ఇట్లు
యర్రం రెడ్డి బాబురావు,
అడ్వకేట్, నందిగామ .
సెల్ 9440 76 1334,
నందిగామ
ది. 24 -6- 2025.

అతివేగంతో స్కూటీని ఢీ కొట్టిన కారు

- ఇద్దరు మహిళలు మృతి, మరొకరికి గాయాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అతివేగంతో కారు స్కూటీని ఢీకొట్టిన ఘటనలో ఇద్దరు మహిళలు మృతిచెందగా.. మరో మహిళ తీవ్రంగా గాయపడింది. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా మొయినాబాద్‌లో బుధవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హిమాయత్‌నగర్ గ్రామానికి చెందిన అశ్విని (37), లక్ష్మి ఇద్దరూ స్కూటీపై హిమాయత్‌నగర్ నుంచి రెడ్డిపల్లి మీసేవ కేంద్రానికి 11 గంటలకు బయలుదేరి వెళ్లారు. మార్గమధ్యలో చిలుకూరు విలేజ్ యూకో బ్యాంక్ దగ్గర కుమ్మరి సుశీల (60) స్కూటీ నడుపుతున్న మహిళను లిఫ్ట్ అడిగింది. దాంతో వారు ఆమెను ఎక్కించుకుని ముగ్గురూ రెడ్డిపల్లి వైపు తిరిగి వస్తుండగా మార్గమధ్యలో బ్రిజా కారు.. స్కూటీ నడుపుతున్న వారిని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో మహిళల తలకు తీవ్ర గాయాలయ్యాయి. అశ్విని, సుశీల ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. గాయపడిన లక్ష్మిని స్థానికులు ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కోవాసంట్‌లోకి ఫణీష్ మూర్తి

హైదరాబాద్: ఎఐ, ఏజెంటిక్ ఎఐ ఆధారిత సాఫ్ట్‌వేర్ సేవల సంస్థ కోవాసంట్ టెక్నాలజీస్ సలహా బోర్డులో టెక్ పరిశ్రమ దిగ్గజం ఫణీష్ మూర్తి చేరారు. నాన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ఆయన తమకు సేవలను అందించనున్నారని ఆ సంస్థ పేర్కొంది. ఎఐ ఆధారిత నిజమైన సామర్థ్యం, స్వయంప్రతిపత్తితో నైపుణ్యాన్ని శక్తివంతం చేయడమే నేటి తమ లక్ష్యమని ఆ సంస్థ ఎండి సివి సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు.

పిజిఇసెట్ ఫలితాలు నేడే

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఎంఈ/ఎంటెక్‌తోపాటు ఎంఫార్మసీ, ఎంఆర్క్, ఫార్మా-డీ (పిబి) కోర్సుల్లో 2025-26 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించిన పోస్టు గ్రాడ్యుయెట్ ఇంజినీరింగ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (పిజిఇసెట్) రాతపరీక్షల ఫలితాలు గురువారం విడుదల కానున్నాయి. ఈ ఫలితాలను గురువారం మధ్యాహ్నం 3.30 గంటలకు హైదరాబాద్ కూకట్‌పల్లి లోని జేఎన్టీయూహెచ్‌లో ఉన్నత విద్యామండలి చైర్మెన్ వి బాలకిష్టారెడ్డి, జెఎన్‌టియుహెచ్ విసి టి కిషన్‌కుమార్‌రెడ్డి, పిజిఇసెట్ కన్వీనర్ ఎ అరుణకుమారి విడుదల చేస్తారు. ఈనెల 17 నుంచి 19 వరకు పిజిఇసెట్ రాతపరీక్షలను నిర్వహించిన విషయం తెలిసిందే.

మోడీ స్టీరింగ్ కార్పొరేట్ల చేతుల్లో..

- దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ
- పెరుగుతున్న ఫాసిస్టు ధోరణులు
- 'ప్రశ్న' వల్లే ఎన్‌డిఎ కూటమికి సీట్లు తగ్గాయి
- కొనుక్కున్నోళ్ల చేతిలోనే పోర్ట్ ఏస్టేట్
- ఎమర్జెన్సీ నాడు-నేడు అంశంపై సిపిఎం నిర్వహించిన సదస్సులో వక్తలు

సెమినార్లో మాట్లాడుతున్న ప్రొ. మాడభూషి శ్రీధర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పెట్టుబడిదారుల ప్రయోజనాలకు అనుగుణంగా ప్రభుత్వాలు పాలన కొనసాగిస్తాయని, ప్రస్తుతం మోడీ స్టీరింగ్ కార్పొరేట్ల చేతుల్లో ఉందని పలువురు వక్తలు విమర్శించారు. ఇందిరాగాంధీ హయాంలో దేశంలో ఎమర్జెన్సీ విధించి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా 'నాడు ప్రకటిత ఎమర్జెన్సీ-నేడు అప్రకటిత ఎమర్జెన్సీ-మనకర్తవ్యాలు' అంశంపై సిపిఎం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సదస్సు నిర్వహించారు. ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆర్‌టిఐ మాజీ కమిషనర్ మాడభూషి శ్రీధర్ మాట్లాడుతూ రాజ్యాంగం, అందులోని సూత్రాలను విస్మరించి నాడు ఎమర్జెన్సీని ప్రకటించారని ఆవేదన వ్యక్తం చేశారు. నాటి రాష్ట్రపతి బాధ్యతగా వ్యవహరించలేదని, అందుకు సంబంధించిన దస్త్రంపై సంతకం పెట్టాల్సి వచ్చినందుకు ఆ నాటి దేశాధ్యక్షుడు నిద్రమాత్రలు వేసుకుని పడుకోవాల్సి వచ్చిందని చెప్పారు. కనీసం క్యాబినెట్‌ను కూడా సమావేశ పర్చకుండా ఆగమేఘాల మీద ఆ చర్య తీసుకోవటం సమర్థనీయం కాదన్నారు. ఇలాంటి తప్పుడు నిర్ణయాల వల్ల ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో ప్రజలు సరైన తీర్పునిచ్చారని గుర్తు చేశారు. సుప్రీంకోర్టు, సీజేఐ, పార్లమెంట్, పీఎం అందరికన్నా గొప్పది రాజ్యాంగమే అన్నారు. దాన్ని బుల్డోజ్ చేస్తే ప్రజలే రాజ్యాంగాన్ని రక్షించుకుంటారనే విషయాన్ని నాటి ఘటనలు చెబుతున్నాయని వివరించారు. ప్రశ్న అనేది అభివృద్ధికి మూలమన్నారు. నాలుగొందల సీట్లు వస్తాయని కలగన్న వారికి ప్రశ్నించే శక్తులు పెరగటం వల్ల అనుకున్న సీట్లు రాలేదని గుర్తు చేశారు. అసమ్మతి, విమర్శించటం, విచక్షణ, వ్యతిరేకించటం అత్యంత సహజమైనవిగా ఉండాలన్నారు. ఏ పరిస్థితుల్లోనైనా వెన్నుముకతో నిలబడాలని సూచించారు.

సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ అప్పుడైనా..ఇప్పుడైనా ప్రభుత్వాన్ని నడుపుతున్నది ప్రధానులు కాదనీ, వారు కేవలం డ్రైవర్లు మాత్రమేనని చెప్పారు. అసలైన డైరెక్టర్లు కార్పొరేట్లని ఉదాహరించారు. కారుకు డ్రైవర్‌గా మోడీ ఉంటే..దాని వెనుక సీట్లో కూర్చొని రైటా, లెఫ్టా ఎటు పోవాలో సూచించేది పెట్టుబడిదారులేనని విశదీకరించారు. ఇప్పుడు అంతా రైటు వైపే ప్రయాణం సాగుతోందని వివరించారు. అయితే ఎప్పుడూ ఇలా ఉండబోదని చెప్పారు. 1960లో కాంగ్రెస్ పార్టీ గుత్తాధిపత్యానికి పెద్ద దెబ్బ తగిలిందన్నారు. అనేక రాష్ట్రాల్లో ప్రతిపక్షాల కూటములు విజయాలు సాధించాయని చెప్పారు. 1970నాటికి తీవ్ర సంక్షోభ పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. నిత్యావసర ధరల విపరీతంగా పెరుగటం, నిరుద్యోగం ఇత్యాది సమస్యలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న నేపథ్యంతో వీటిని అధిగమించేందుకు నాటి ప్రభుత్వం ఎమర్జెన్సీ ప్రకటించిందని వివరించారు. ప్రస్తుతం నాటి ఎమర్జెన్సీలాంటి పరిస్థితులు వచ్చాయని వాపోయారు. ఫైనాన్స్ పెట్టుబడి రాజ్యమేలుతోందని చెప్పారు. పెట్టుబడికి నష్టం వస్తుందంటే ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తుందని చెప్పారు. దానికి నష్టం రానంత వరకు ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ వ్యవస్థలను నెత్తిన పెట్టుకుంటుందని వివరించారు. పెట్టుబడి ప్రయోజనాలు ముందుకు పోవాలంటే హక్కులు, చట్టాలు పోరాటాలు, సమ్మెలు ఆటంకంగా ఉండకూడదనే ఉద్దేశంతోనే నాలుగు లేబర్‌కోడ్లు, ఇతర సవరణలు తీసుకొస్తున్నారని చెప్పారు.

సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు టి జ్యోతి మాట్లాడుతూ ఎమర్జెన్సీకాలంలో ఎన్నో దారుణాలు జరిగాయన్నారు. రాజకీయ ప్రత్యర్థులను జైల్లో పెట్టటం, పత్రికలపై సెన్సార్ విధించటం, పాత్రికేయులు, కార్యకర్తలు జైళ్లపాలయ్యారని చెప్పారు. నాటి ప్రభుత్వం ప్రతిపక్షాలు, ప్రజా ఉద్యమాల గొంతు నొక్కేందుకు పూనుకుందన్నారు. నేటి మోడీ పాలన కూడా ఎమర్జెన్సీ కాలాన్ని మరిపిస్తోందని వ్యాఖ్యానించారు. అన్ని రకాల హక్కులు హరించబడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎక్కడా స్వేచ్ఛ లేదన్నారు. గొంతెత్తిన వారిని జైల్లో కుక్కుతున్నారనీ, లేదంటే హత్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నాడు మీసా ఉంటే..నేడు ఉపా చట్టాన్ని తీసుకొచ్చారని గుర్తు చేశారు. రాజ్యాంగబద్ధ సంస్థలను తమ రాజకీయ ప్రయోజనాలకు వాడుకుంటున్నారని చెప్పారు. మహిళలపై హింస పెరిగిందనీ, దాడులు చేసిన వారికి ప్రభుత్వ పెద్దలే వత్తాసుగా ఉంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే అభివృద్ధి అని గొప్పలు చెప్పుకుంటున్న మోడీ సర్కార్...17 బిజెపి పాలిత రాష్ట్రాల్లో ఇతర మతస్తులను పెండ్లి చేసుకోవటాన్ని తప్పు పడుతూ చట్టం తీసుకొచ్చారని తెలిపారు. అప్రకటిత ఎమర్జెన్సీని కొనసాగిస్తున్న మోడీకి ఎమర్జెన్సీ వ్యతిరేక దినంగా పాటించే నైతిక హక్కులేదని తెలిపారు.

రాష్ట్రంపై కేంద్రం వివక్ష

- కృష్ణా జలాలపై హరీశ్ ఎందుకు సంతకం పెట్టారు : మహేశ్‌కుమార్‌గౌడ్

ప్రజాశక్తి-హైదరాబాద్ బ్యూరో: రాష్ట్రానికి రావాల్సిన నిధులు, పథకాల విషయంలో కేంద్ర ప్రభుత్వం తీవ్ర వివక్షను కొనసాగిస్తున్నదని టిపిసిసి అధ్యక్షులు బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్ విమర్శించారు. మోడీ సర్కారు ఉద్దేశపూర్వకంగానే రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు రాష్ట్రంలో బిఆర్ఎస్ అభూత కల్పనలతో కూడిన సోషల్ మీడియా ప్రచారం చేస్తున్నదని విమర్శించారు. ఆ పార్టీ తన అనుకూల సోషల్‌మీడియా ద్వారా అవాస్తవాలను, అబద్ధాలను ప్రచారం చేస్తూ...ప్రజలను పక్కదోవ పట్టిస్తున్నదని విమర్శించారు. ఆనాడు పోతిరెడ్డి ప్రాజెక్టు కట్టుకునేందుకు జిఒలు ఇచ్చింది బిఆర్ఎస్ ప్రభుత్వం కాదా? అని ప్రశ్నించారు. కృష్ణా జలాల విషయంలో ఎందుకు సంతకం పెట్టారంటూ మాజీ మంత్రి హరీశ్‌రావును ప్రశ్నించారు.

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ గెలుపు తథ్యమని మహేశ్‌కుమార్ ధీమా వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలకు, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు పార్టీని సన్నద్ధం చేసేలా పలు కీలక నిర్ణయాలు తీసుకున్నట్టు తెలిపారు.

ఐఅండ్‌పిఆర్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన ఐఎఎస్ అధికారి ప్రియాంక బుధవారం రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిని సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.

28న అమేయ దాబ్లీ సంగీత ప్రదర్శన

ప్రజాశక్తి - హైదరాబాద్

కేస్టోన్ ఉత్సవ్ ద్వారా అమేయ దాబ్లీ తన కృష్ణా : మ్యూజిక్, బ్లిస్అండ్ బియాండ్ సంగీత ప్రదర్శనను హైదరాబాద్‌లో ఏర్పాటు చేస్తోన్నట్లు ప్రకటించారు. జూన్ 28న శిల్పాకళా వేదికలో సాయంత్రం 6 గంటలకు తమ ప్రదర్శన ప్రారంభం అవుతుందని దాబ్లీ వెల్లడించారు. ఇక్కడ ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో దాబ్లీ మాట్లాడుతూ.. గత 14 ఏళ్లలో 4000కి పైగా దేశ, విదేశాల్లో సంగీత ప్రదర్శనలు ఇచ్చామన్నారు. నగరంలో ఏర్పాటు చేస్తోన్న ఈ ప్రదర్శనకు 1800 పైగా ప్రేక్షకులు హాజరు కానున్నారన్నారు. బుక్‌మైషోలో టికెట్లను విక్రయిస్తోన్నట్లు తెలిపారు. కపూర్ ఖాందాన్, రాణి ముఖర్జీ, ఆదిత్య చోప్రా, జిందాల్ కుటుంబం, ఎమామీ గ్రూప్‌లోని అగర్వాల్ కుటుంబం లాంటి ప్రముఖుల కోసం కచేరీలను నిర్వహించామన్నారు

డ్రగ్స్‌కు బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దు

- ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్ సి హరికిరణ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మత్తు పదార్థాలకు బానిసై విద్యార్థులు, యువత తమ విలువైన జీవితాలను నాశనం చేసుకోవద్దని తెలంగాణ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్ సి.హరికిరణ్ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం హైదరాబాద్‌లోని నెక్లెస్‌రోడ్‌లో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుకుని ఉన్నత లక్ష్యాలతో జీవితంలో స్థిర పడాల్సిన వారు క్షణికమైన సుఖాలకు అలవాటు పడి తాము నష్టపోతూ, తమ తల్లిదండ్రులకు తీరని శోకాన్ని మిగులుస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థలు ఈ మహమ్మారిని అరికట్టడంలో తమ వంతు పాత్ర పోషించాలని సూచించారు. ఈ సందర్భంగా ప్లకార్డులు, బ్యానర్లు, జెండాలను ప్రదర్శిస్తూ నెక్లెస్ రోడ్‌నుంచి పివి విగ్రహం వరకు డ్రగ్స్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ షానవాజ్ ఖాసీం, అబ్కారి శాఖకు చెందిన అధికారులు, సిబ్బంది, సీనియర్ సిటిజన్లు, విద్యార్థులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

సర్కారు బడుల్లో చేరుతున్న విద్యార్థులు

తెరుచుకున్న జీరో ఎన్‌రోల్‌మెంట్ స్కూళ్లు 138

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు చేరేందుకు మొగ్గు చూపుతున్నారు. గత విద్యాసంవత్సరంలో జీరో ఎన్‌రోల్‌మెంట్ స్కూళ్లలోనూ విద్యార్థులు చేరుతుండడం గమనార్హం. 2025-26 విద్యాసంవత్సరంలో 138 ప్రభుత్వ పాఠశాలలు తెరుచుకున్నాయి. వాటిలో 1,224 మంది విద్యార్థులు చేరారు. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ సంచాలకులు, సమగ్ర శిక్ష స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ ఈ నవీన్ నికోలస్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 20 జిల్లాల్లో గత విద్యాసంవత్సరంలో జీరో ఎన్‌రోల్‌మెంట్ ఉన్న 138 పాఠశాలల్లో 1,224 మంది విద్యార్థులు చేరారని వివరించారు. ఆదిలాబాద్‌లో రెండు స్కూళ్లలో 31 మంది, జగిత్యాలలో ఏడు బడుల్లో 76 మంది, జనగామలో రెండు స్కూళ్లలో 64 మంది, కామారెడ్డిలో ఒక బడిలో 19 మంది, కరీంనగర్‌లో ఎనిమిది పాఠశాలల్లో 42 మంది, ఖమ్మంలో 15 స్కూళ్లలో 196 మంది, మహబూబాబాద్‌లో రెండు బడుల్లో 29 మంది, ములుగులో నాలుగు పాఠశాలల్లో 21 మంది, నాగర్ కర్నూల్‌లో 23 స్కూళ్లలో 129 మంది, నల్లగొండలో ఏడు బడుల్లో 38 మంది. నిర్మల్‌లో మూడు పాఠశాలల్లో 28 మంది, పెద్దపల్లిలో ఐదు స్కూళ్లలో 50 మంది, రాజన్న సిరిసిల్లలో ఆరు బడుల్లో 55 మంది, రంగారెడ్డిలో 26 స్కూళ్లలో 210 మంది, సంగారెడ్డిలో ఒక బడిలో 12 మంది, సిద్దిపేటలో ఐదు పాఠశాలల్లో 99 మంది, సూర్యాపేటలో 11 స్కూళ్లలో 62 మంది, వికారాబాద్‌లో ఐదు బడుల్లో 35 మంది, యాదాద్రి భువనగిరిలో 16 మంది చొప్పున చేరారని వివరించారు.

ఒగ్గుబీర్ల కళాకారుల సమస్యలు పరిష్కరించాలి

- జిల్లా కేంద్రంలో చుక్కా సత్తయ్య పేరుతో కళాక్షేత్రాన్ని నిర్మించాలి
- ఒగ్గుబీర్ల కళాకారుల సంక్షేమ సంఘం

సాంస్కృతిక ప్రదర్శన నిర్వహిస్తున్న ఒగ్గుబీర్ల కళాకారులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఒగ్గుబీర్ల కళాకారుల సమస్యలు పరిష్కరించి వారికి తగిన ప్రాధాన్యత ఇవ్వాలని ఒగ్గుబీర్ల సంఘం రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఒగ్గు ధర్మయ్య, ఒగ్గు రవి కోరారు. బుధవారం జనగామ జిల్లా కేంద్రంలోని ఎంఎంఆర్ గార్డెన్‌లో తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతిక శాఖ, జనగామ జిల్లా ఒగ్గుబీర్ల కళాకారుల సంక్షేమ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో 'ఒగ్గు కళా వికాసం, భవిష్యత్తు ప్రణాళిక' అంశంపై సదస్సు, ఒగ్గుకల మహోత్సవం-2025 కార్యక్రమం నిర్వహించారు. అంతకుముందు జనగామ పట్టణంలోని ప్రధాన రహదారుల గుండా ఒగ్గుబీర్ల కళాకారుల కళాబృందాలతో ప్రదర్శన నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఒగ్గుబీర్ల పూజారులు, బోనాల కోలాటం, ఆడబిడ్డల అడుగుల సవ్వడితో జనగామ జిల్లా బీరప్ప గుడి నుంచి మొదలైన మల్లన్న శోభాయాత్ర వైభవోపేతంగా వేదికకు చేరుకుంది. జిల్లాలోని మండలానికి మూడు చొప్పున ఒగ్గు బృందాలు జనారంజకంగా ప్రదర్శనలు చేశాయి. ఈ సందర్భంగా ధర్మయ్య, రవి మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలో ఒగ్గు కళా సామ్రాట్ చుక్కా సత్తయ్య పేరు మీద ఒగ్గు కళాక్షేత్రాన్ని నిర్మించాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా అనేకమంది ఒగ్గుబీర్ల పూజారులు కేవలం వృత్తిని నమ్ముకుని కళా జీవితం గడుపుతున్నారన్నారు. అత్యంత భక్తిశ్రద్ధలతో మల్లన్న పట్నాలు, బీరన్న పట్నాలు వేసి ఇంటికి తిరుగు ప్రయాణం సమయంలో కాలం కనికరించక రోడ్డు ప్రమాదాలకు గురై అంగవైకల్యం చెందిన పూజారులు కొంతమంది అయితే, ఎక్కువ మంది ప్రాణాలు కోల్పోయిన వారే ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆత్మగౌరవంతో జీవించే కళాకారుని కుటుంబం నేడు అప్పులపాలై, కడు బీదరికంతో అన్నమో రామచంద్ర అనే చందంగా ఉందన్నారు. జనగామ జిల్లాలో పెద్ద సంఖ్యలో ఒగ్గుబీర్ల కళాకారులు ఉన్నారని తెలిపారు. ఒగ్గు పూజారులకు ఆరోగ్య బీమా, జీవిత బీమా కల్పించాలన్నారు. అర్హులైన వృద్ధ కళాకారులకు(45ఏండ్లు) రూ.6000 చొప్పున పెన్షన్ అందించాలని కోరారు. ఇండ్లు లేని నిరుపేదలైన ఒగ్గు పూజారులకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలన్నారు. తెలంగాణ సాంస్కృతిక సారథిలో అర్హులైన ఒగ్గుకళాకారులకు ఉద్యోగం కల్పించాలన్నారు. ఈ సందర్భంగా జిల్లాలోని ఆయా మండలాలకు చెందిన ఒగ్గుబీర్ల కళాకారులు పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జనగామ జిల్లా కురుమ సంఘం అధ్యక్షులు కంచ రాములు, ప్రధాన కార్యదర్శి జాయ మల్లేశం, ఒగ్గు సంఘం జనగామ జిల్లా అధ్యక్షులు బండి వీరస్వామి, ప్రధాన కార్యదర్శి జంగిడి సిద్ధులు, ప్రచార కార్యదర్శి బర్ల అనిల్ కుమార్, కురుమ సంఘం టౌన్ అధ్యక్షులు బాల్దమల్లేశం తదితరులు పాల్గొన్నారు.

మహిళపై వ్యక్తి లైంగికదాడి

- ఓయోలో బ్యూటీషియన్ అనుమానాస్పద మృతి
- రాయదుర్గం పరిధిలో ఘటనలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రంగారెడ్డి జిల్లా రాయదుర్గం పోలీసుస్టేషన్ పరిధిలో దారుణాలు చోటుచేసుకున్నాయి. ఓ ఘటనలో ఓయో హోటల్‌లో బ్యూటిషియన్ అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. మరో ఘటనలో ఓ మహిళపై గుర్తు తెలియని వ్యక్తి లైంగికదాడికి పాల్పడ్డాడు. సిఐ సిహెచ్ వెంకన్న తెలిపిన వివరాల ప్రకారం.. అనూష (26) అనే యువతి బ్యూటీషియన్‌గా పని చేస్తున్నారు.

పెళ్లయిన కొద్ది రోజులకే భర్తతో విడిపోయి తల్లిదండ్రుల వద్ద ఉంటున్నారు. ఈ నెల 22న స్నేహితుల వద్దకు వెళుతున్నానని ఇంట్లో చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. కాగా, రాయదుర్గం పరిధి గుల్షన్ కాలనీలోని ఓయో లాడ్జిలో ఫ్యాన్‌కి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. గమనించిన ఓయో నిర్వహకులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. అనూష ఆత్మహత్యపై అనుమానాలు ఉన్నాయని ఆమె సోదరుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళపై లైంగిక దాడి

గచ్చిబౌలిలోని ఓ మద్యం షాప్‌లో గుర్తు తెలియని వ్యక్తితో మహిళకు పరిచయం ఏర్పడింది. అక్కడ ఇద్దరూ తాగారు. అనంతరం ఆ దుండగుడు ఆమెను తన రూమ్‌కి రమ్మని పిలిచాడు. అక్కడకు వెళ్లాక మళ్లీ బాధితురాలికి మద్యం తాగించాడు. మత్తులోకి వెళ్లిన ఆమెపై లైంగికదాడికి పాల్పడ్డాడు. ఆమె నగ్న ఫొటోలు తీసి భయభ్రాంతులకు గురి చేశాడు. దాంతో బాధితురాలు అతని నుంచి తప్పించుకొని రాయదుర్గం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మాజీ సర్పంచులకు పెండింగ్ బిల్లులు ఇప్పించండి

- మానవ హక్కుల కమిషన్‌కు సర్పంచుల సంఘం జెఎసి వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గ్రామాల్లో అభివృద్ధి పనులు చేసిన మాజీ సర్పంచులకు పెండింగ్ బిల్లులను ఇప్పించాలని బుధవారం హైదరాబాద్‌లో మానవ హక్కుల కమిషన్ కమిషనర్‌కు సర్పంచుల సంఘం జెఎసి వినతిపత్రం అందజేసింది. మాజీ సర్పంచుల ఆత్మహత్యలను సుమోటోగా స్వీకరించాలని విన్నవించింది. ఈ కార్యక్రమంలో జెఎసి రాష్ట్ర అధ్యక్షులు సుర్వి యాదయ్యగౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు గుంటి మధుసూదన్‌రెడ్డి, నాయకులు, మాజీ సర్పంచులు బీరప్ప, కోర్వ గంగాధర్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా యాదయ్య గౌడ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో 2019 నుంచి 2024 వరకు ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. డబ్బులు వడ్డీలకు తెచ్చి అభివృద్ధి పనులు చేసి ఆత్మహత్యలు చేసుకుంటున్నారని వాపోయారు. 18 నెలలుగా ప్రభుత్వం బిల్లులు చెల్లించకుండా కక్ష సాధింపు చర్య పాల్పడుతున్నదని వాపోయారు. అప్పుల బాధతో రోజుకో మాజీ సర్పంచ్ మరణిస్తున్నాడని వాపోయారు. ప్రభుత్వంపై చర్యలు తీసుకుని మాజీ సర్పంచుల బిల్లులు ఇప్పించాలని కోరారు.

తెలుగు భాషా మాండలిక పరిశోధకుడు తిరుమల రామచంద్ర

ప్రజాశక్తి - కల్చరల్

తెలుగు భాషలో మాండలిక పద ప్రయోగాలలో గుణ దోషాలు పై సాధికార వ్యాసాలు రాసిన తిరుమల రామచంద్ర మాండలిక భాషా పరిశోధకుడని తెలంగాణ పోలీస్ హౌజింగ్ కార్పొరేషన్ పూర్వ చైర్మన్ కొల్లేటి దామోదర్ గుప్త అన్నారు. సోమవారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభ లోని కళా సుబ్బారావు కళా వేదికపై ఎందరో మహానుభావులు మధురస్మృతులు కార్యక్రమంలో భాగంగా తిరుమల రామచంద్ర యాదిలో కార్యక్రమం గాన సభ నిర్వహణ లో అధ్యక్షుడు కళా వి ఎస్ జనార్ధన మూర్తి అధ్యక్షతన జరిగింది. కొల్లేటి దామోదర్ గుప్త మాట్లాడుతూ రామచంద్ర ఆంధ్రపత్రికలో ఎన్నో గొప్ప గొప్ప వ్యాసాలు రాశారని వివరించారు. సీనియర్ పాత్రికేయులు జయసూర్య మాట్లాడుతూ భాషా శాస్త్ర పరిశోధనలో అగ్రగణ్యులు రామ చంద్ర అని వారి రచనలు అందుబాటులోకి తేవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాపోషకులు వడ్లకొండ వెంకట రావు, గానసభ సంయుక్త కార్యదర్శి తాళ్లపల్లి చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

ప్రశంస ప్రతిభకు ఆక్సిజన్ వంటిది

ప్రజాశక్తి కల్చరల్

చిన్న ప్రశంస ప్రతిభకు ఆక్సిజన్ వంటివని కేంద్ర హోమ్ శాఖ పూర్వ కార్యదర్శి పద్మ భూషణ్ కె పద్మనాభయ్య అన్నారు శ్రీ త్యాగరాయ గానసభ ప్రధాన వేదికపై ప్రముఖ సాంస్కృతిక సంస్థ రసమయి, డాక్టర్ పైడి లక్ష్మయ్య ట్రస్ట్ నిర్వాహణలో డాక్టర్ పైడి లక్ష్మయ్య సంజీవ రెడ్డిల పేరిట స్మారక పురస్కారాలు పూర్వ విజిలెన్స్ కమిషనర్ కెవి చౌదరి, వసుధ ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకట రామ రాజు, నటుడు నారా చంద్రబాబు నాయుడు రచయిత్రి డాక్టర్ శరత్ జ్యోత్స్న రాణిలకు ముఖ్య అతిథిగా పద్మనాభయ్య బహుకరించి మాట్లాడారు. లక్ష్మయ్య సంజీవ రెడ్డి తండ్రీ కొడుకు ఇరువురూ సివిల్ సర్వీస్ ఉన్నత అధికార స్థాయిలో ప్రజా సంక్షేమం లక్ష్యంగా పని చేసి ఇతరులకు మార్గదర్శకులుగా నిలిచారని కొనియాడారు. అధ్యక్షత వహించిన ఆదాయ పన్ను ల శాఖ విశ్రాంత ముఖ్య కమిషనర్ నరసింహప్ప మాట్లాడుతూ లక్ష్మయ్యలో ఆధ్యాత్మిక భావనలు ఎక్కువని శ్రీశైలం అభివృద్ధి ఆయన విశేష కృషి చేశారని వివరించారు. సంజీవరెడ్డి తాను నమ్మిన సిద్ధాంతంతో నిజాయితీ నిబద్ధతతో పని చేశారని ప్రశంసించారు. దంత వైద్యులు డాక్టర్ నారాయణ తదితరులు పాల్గొన్న సభలో డాక్టర్ రాము స్వాగతం పలికారు. ఆశా లత వ్యాఖ్యానంలో ప్రముఖ నాట్య గురువు రేణుకా ప్రభాకర్ శిష్య బృందం డాక్టర్ రాము రచించిన నందమూరి నవోదయమ్ నృత్య రూపకం కన్నుల పండుగగా ప్రదర్శించారు.

మియాపూర్‌లో టెకీ ఆత్మహత్య

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

మియాపూర్ పరిధిలో ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన విషాదం రేపింది. మానసిక రుగ్మతలు, ఒత్తిడి వల్లే ఆత్మహత్యకు పాల్పడినట్లు అతడి తల్లిదండ్రులు తెలిపారు. హైదరాబాద్‌లో ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేస్తున్న అనిల్ అమిత్ చౌడ (30).. మియాపూర్‌లోని హఫీజ్‌పేటలో తల్లిదండ్రులతో కలిసి నివాసం ఉంటున్నాడు. ఇటీవలే అతడికి ఓ యువతితో నిశ్చితార్థం జరగ్గా.. నవంబర్‌లో వివాహం జరగాల్సి ఉంది. అయితే, మంగళవారం రాత్రి గదిలోకి వెళ్లిన అనిల్.. ఎంత సేపటికీ తలుపులు తెరవకపోవడంతో తల్లిదండ్రులు తలుపులు బద్దలు కొట్టి చూడగా.. సీలింగ్ ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. దీంతో తీవ్ర దిగ్భ్రాంతికి లోనైన తల్లిదండ్రులు మియాపూర్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. కేసు నమోదు చేసిన పోలీసులు.. అనిల్ మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఆస్పత్రికి తరలించారు.

దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

- రాష్ట్ర ఆటో మోటార్ సంఘాల జెఎసి పిలుపు

అభివాదం తెలుపుతున్న రాష్ట్ర ఆటో మోటార్ సంఘాల జెఎసి నాయకులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జులై 9న నిర్వహించనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని రాష్ట్ర ఆటో మోటార్ సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ పిలుపునిచ్చింది. బుధవారం హైదరాబాద్ విద్యానగర్‌లోని మార్క్స్ భవన్‌లో టియుసిఐ అనుబంధ తెలంగాణ ప్రోగ్రెసివ్ ఆటో అండ్ మోటార్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు వి.ప్రవీణ్ అధ్యక్షతన ఐక్య కార్యాచరణ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమ్మెను రాష్ట్ర ఆటో మోటార్ సంఘాలు అన్నీ సంపూర్ణంగా బలపరుస్తూ పాల్గొంటాయని ప్రకటించారు. కార్మిక వర్గాన్ని బానిసలుగా మార్చే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కనీస పెన్షన్ నెలకు రూ.9000, కాంట్రాక్ట్, ఫిక్స్ టర్మ్ సిస్టం రద్దుచేసి మొత్తం కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరారు. కేంద్ర రవాణా (సవరణ) చట్టం 2019 సవరించాలని, మోటార్ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, రాష్ట్రంలో ఆటో డ్రైవర్లను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. జులై 3, 4, 5, తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా ఆటో, లారీ, టాక్సీ, వ్యాన్, ట్రాలీ, గూడ్స్ తదితర వాహనాలతో ప్రదర్శనలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. జులై 9న రాష్ట్రవ్యాప్తంగా బంద్ నిర్వహించాలని, రవాణా రంగం సంపూర్ణంగా బంద్‌లో పాల్గొనాలని కోరారు. ఈ సమావేశంలో టియుసిఐ నాయకులు ప్రవీణ్, లింగం గౌడ్, మహమ్మద్ అఫ్జల్, ఐఎన్టీయూసీ రాష్ట్ర అధ్యక్షులు జి.మల్లేష్ గౌడ్, ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.వెంకటేశం, నాయకులు ఎస్.అశోక్, సీఐటీయూ నాయకులు పి శ్రీకాంత్, బిఆర్‌టియు రాష్ట్ర అధ్యక్షులు వేముల మారయ్య, ఐఎఫ్‌టియు నాయకులు చిన్నం బాల నరసింహ, పి రామ్‌రెడ్డి, టిఎన్‌టియుసి రాష్ట్ర నాయకులు పి యాదగిరి, నాయకులు ఎల్ కొండల్ తదితరులు పాల్గొన్నారు.